# సీజనల్ భావాలు

—"మహేశ్వర్"

ఒకానొక ప్రశాంత వసంతరాత్రి : కవీ, ప్రియురాలూ ప్రేమకోసం కొట్లాడు తున్నారు.

ప్రి:-కవీ! అహోరాత్రాలు నీకై తపించేను. నీ హృదయంలో ఋతువులు మారలేదా? నాపై నీ కెందుకు ప్రేమలేదు కవీ!

క:-ప్రేమకీ పాత్రాపాత్ర విచక్షణ లేదా? నువ్వు నా ప్రేమకి అనర్హురాలివి!

ప్రి:-నీ హృదయం రాళ్ళగుట్టా ?

క:-పాషాణ నిర్మితం! నీ అనురాగానికి అచంచలమైనది.

ప్రి:-ఓ పాషాణేశ్వరుడా! జోహారు. ఒక నాటికేనా నువ్వు నాకు ప్రసన్నుడవి కాకపోవు! నా హృదయం రాయి చేసుకుంటాను-మహోన్నత పర్వత శిఖారన ఉన్న నీ ప్రేమ శిల కవిలి కదలి దొర్లిపోతుంది—విరిగిపోతుంది—ముక్కముక్కలై, గులకరాళ్ళగా నా ప్రేమైన హృదయశిలని కప్పివేస్తుంది!!

తరవాత కథ నేచెప్పేస్తాను. కవిమీద ప్రియురాలికి గల ప్రేమ పాషాణం ఐపోతుంది. మరో దృష్టితో చూస్తేవారి ప్రేమ శిలారూపం పొందిపోయింది.

శిలా విగ్రహాల్ని పూజిస్తూన్నట్టే ప్రేయసి శిలాప్రేమని పూజుస్తోంది. ఏది శాశ్వతమైన ప్రేమ? ఈ శిలాప్రేమ అంటే రాతిప్రేమన్న మాట. Stone Love! అనేక రకాల ప్రేమల్లో ఇదో రకం! ఒక విరహం లేదు, ఒక నరాల బాధలేదు, ఒకసారి రక్తం ఉప్పొంగడం లేదు-నిరుపమాన అచంచల ప్రేమ ఈ శిలాప్రేమ. కవి సృష్టికర్తతో సమానం, కనుకనే ఎన్నో రకాల ప్రేమనీ బాధనీ సృష్టించుకో గలుగుతాడు. ఇంకా సృష్టిస్తాడు. మచ్చుకి మరో Love! లేదంటే ఫాస్ఫరస్ ప్రేమ! సంకల్ప మాత్రాన హృదయంతో పలకరించినా భస్మం!

కవి భావనా పరంపరలనే పదార్థంతో కమ్మి ఉంటుంది ఈ ఫాస్ఫరస్‌లా! ఆ భావాల్ని ఏ మాత్రం రేపినా అది రగుల్కొంటుంది! ఆధునిక యుగంలో విజ్ఞానం విజృంభిస్తూన్నట్టే ఈ ప్రేమలూ విజృంభిస్తున్నాయ్.

కవిలో గొప్ప పరివర్తన-సంచలనం-ఏదైతే గానీండి. ప్రియురాల్ని పిలిపించేడు. "నిన్ను ప్రేమిస్తున్నాను. దాసోహం!" అన్నాడు.

"స్త్రీకి లొంగననే గర్వం ఏమైంది?" అన్నదామె—

"అశక్తుణ్ణి-నిరాధుయుణ్ణి-సఖీ, నీ మరతుల కొప్పుకుంటాను—ఈ కవి నీ పాదాక్రాంతేతు!"

"నీ పాషాణహృదయం కరిగిందా?"

"పాదరసమై పరుగెడుతోంది · నీ ప్రేమ కొరకు!"

చాటుగా పిల్చి కవిన్ని అడిగేను. "ఇంత గొప్పవాడివీ ఎలా మారిపోయేవ్?" అని.

"నీకు తెలీదు-నా ప్రియురాలు కళ్ళవెనక యాటోమిక్ బాంబులున్నాయ్-ఒక్కసారి రెప్ప కదులుస్తేనా ప్రేమరాజ్యం శ్మశానం ఐపోదూ?" అన్నాడు.

కవి తీర్పులో చక్కని సత్యం ఉంది: ఏమంటే కొందరి అమ్మాయిల చూపులుపడితే ఆ మొగాడు వాడి, వాడి-పీనుగైపోతాడు-! ఆడదాని దృష్టిముందు యటోమిక్ బాంబు ఎందుకు పనికొస్తుంది?

# లో గుట్టు

రచన: బి. విశ్వేశ్వరరావు

"అందరికి ఉచితము. హనుమాన్ ఉపాసకులైన శ్రీమాన్ వేదమూర్తుల వారిచే అద్భుత జోస్యం వేలాద్రి గ్రామంలో చెప్పబడుతూంది."

ఈ ప్రకటన పత్రికల్లో చూచేసరికి చెప్పొద్దూ నాకే గనుక రెక్కలుంటే అమాంతంగా ఎగిరి వేలాద్రి గ్రామం చేరుకొనే వుండే వాణ్ణి. నాకు జోతిషం అంటే అదో పిచ్చి. కానీ మరీ కొండంత లేకపోయినా గుట్టంత మాత్రం వుండేదని నిస్సందేహంగా చెప్పొచ్చు. ఏలాగైనాసరే వేలాద్రికి వెళ్ళాలంటే వెళ్ళాలనుకున్నాను.

ఉదయం ఐదుగంటల బండికే బయల్దేరాను. అక్కడికి చేరుకొనేసరికి సరిగ్గా ఎనిమిదిగంటలైంది. తిన్నగా స్టేషనునుంచి వాళ్ళవాళ్ళ నడుక్కుంటూ జోష్యులవారున్న చోటికి దారి తీసాను. అక్కడి కెళ్ళి చూచేను కదా! నాకే ఆశ్చర్యమేసింది. ఎనిమిదిగంటలకే జనం కిటకిటలాడుతూంది! జోష్యం చెప్పేతను ఎంత మేధావంతుడయితే అతనికోసం ఇంత/జనం ఇక్కడ ఎనిమిదిగంటలకే కాచుకొని కూర్చుంటారు? అని అనుకుంటూ చొరవచేసుకొని లోపలికెళ్ళాలనుకొన్నాను. కానీ ఏమీ లాభం కనబడలేదు. మళ్ళీ వచ్చినదారే పట్టుదామని అనుకొన్నాను లోపలి కెళ్ళడానికి ఏమాత్రం సాధ్యపడదు. మరేలా జోష్యం చెప్పించుకోవడం? మనకే గనుక అదృష్టమనేది వుంటే ఆయన ఇందరిలో మొట్టమొదట మనల్నే పేరెట్టి పిల్చి జోష్యం చెప్పకూడదూ! అని నాకు నేనే సమాధాన పరచుకొన్నా. అక్కడ వున్నవాళ్ళనీ ఎప్పుడు జోష్యం చెప్తారని అడిగాను. అందుకు అక్కడ వున్న ఒకాయన "మీరిలా తొందర పడితే లాభంలేదు. స్వాములవారు ఇంకా నిష్ఠనుంచి లేవలేదు" అని చెప్పాడు. "అయితే ఎప్పుడు లేస్తారు?" అని మళ్ళీ అతన్నే ప్రశ్నించాను. "అదేమో, నే నేలా చెప్పగలను. రోజూ తొమ్మిది, లేక పదింటికల్లా లేవడం మామూలు. కానీ ఒకొక్కరోజు పన్రెండు వొంటిగంట కూడా అవుతుంది. అక్కడ వున్న వాళ్లు కాచుకొనే వుండాలి" అంటూ సమాధాన మిచ్చాడు.

గంట పదకొండు దాటింది. కానీ స్వాములవారింకా నిష్ఠనుంచి లేచారుకారు. ఇంకెంత కాలమని కాచుకొని కూర్చోనూ? కడుపులో ప్రేగులు ఆకలో అన్నట్లు అరుస్తున్నాయి. ప్రక్కన హోటలుకెళ్ళి కాఫీనైనా పోయించుక వద్దామని హోటలుకెళ్ళి కూర్చున్నాను. మొదట్లో నన్నెవరూ గమనించలేదు. తొమ్మిదణాలాన్నరకు ఫలహారాలారగించాక హోటల్ యజమాని "ఏమండీ మీదేయూరు" అని పలకరించాడు. ఇదే సమయమని "మాది పొరుగూరు

---

## ఆనందవాణి

★

రచయితలు చాలామంది తాము పంపించ రచనలు ప్రకటింపబడతాయో లేదో తెలియక చాలా తహతహపడుతూ వుంటారు.

మీ రచనలతో బాటు పోస్టుబిళ్ళలు కూడా పంపిస్తే సాధ్యమైనంతత్వరలో, ప్రకటించేదీ లేనిదీ తెలియబరుస్తూ, ప్రకటించడానికి వీలులేనియెడల సదరు రచనలు త్రిప్పి పంపబడును.

ఆనందవాణికి ఏజంట్లు, చందాదార్లు మొదలయినవారు పంపించే మనియార్డరు వ్యక్తుల పేర గాకుండా "మేనేజరు, ఆనందవాణి, నెం. 12, తంబుచెట్టి వీధి, మద్రాసు" అని వ్రాసి పంపవలెను.

లెండి. అసలిట్టు ఇక్కడ జోష్యం చెపుతూన్న స్వాములవారు ఎప్పుడు నిష్టనుంచి లేస్తారో మీ కేమైనా తెలుసా" అని అడిగాను.

"సాధారణంగా పండ్రెండు గంటలకల్లా లేవడం మామూలు" అని జవాబిచ్చాడు.

"ఈ వచ్చినవాళ్ళందరికీ ఈయనగారలా జోష్యం చెపుతారండీ. "క్యూ" పద్ధతి లాగా వరుసగా నిలబెట్టి ఒక్కొక్కరికి చెప్పుతూ వస్తారా?" అని మళ్ళీ ప్రశ్నించాను.

అందు కతను "ఆయనగారు జోష్యం చెప్పే విధానమే వేరు. ఆ జనసమూహంలో ఆయనకు తోచిన వారినే పిలిచి జోష్యం చెపుతారు. రోజుకి పది పండ్రెండుగురికే అలా చెపుతారు. మిగతావాళ్లు మరుసటి రోజున రావాల్సిందే" అని జవాబిచ్చాడు.

"ఈ భాగ్యానికా ఇంతకాలం కాచుకొని కూర్చోవాలి?"

"మరేం చెయ్యమన్నారు. డబ్బులు పుచ్చుకొని చెప్పేవారైతే తొందరపెట్టొచ్చు..."

"సరే కానీ అతనికి పిల్లాజల్లా వున్నారా?"

"లేకేం ఎనిమిదిమంది కొడుకులు, ఆరుగురు కుమార్తెలూ వున్నారు."

"అలాగా! మరి ఆస్తి ఏమైనా వెనుకేసు కొచ్చారా?"

"చిల్లిగవ్వైనా లేదు."

"ఆశ్చర్యంగా వుంది! ఆయనగారు జోష్యం చెప్పడంవల్ల మీ హోటలుకే లాభంగా వుంది కాని ఆయనగారి కేమీ దమ్మిడీకూడా ఆదాయం కనబడ్డంలేదే?"

"లేకేం. ఈ హోటలులో వస్తూన్న లాభమంతా అతనికే చేరుతుంది."

"అదేమిటి! మీరు సంపాదించడము ఆయనగారి కియ్యడమా!"

"అసలు విషయం చెప్పేదాకా మీరు నన్నొదిలేటట్టు లేదే? ఈ హోటలు అతనిదేనండి. మొదట్లో ఇందులో చాలా నష్టమొచ్చింది. ఈలా జోష్యం చెప్పడం ఆరంభించినప్పట్నుంచి ప్రతిరోజూ జనం వస్తూన్నారు. అలా వచ్చినవారు పండ్రెండు ఒంటిగంటదాకా ఇక్కడ వుండాల్సివస్తూండడంచేత తప్పనిసరిగా కాఫీలకనీ, భోజనాలకని ఇక్కడికే వస్తారు. దీని మూలంగా ఎక్కువ లాభం వస్తోందీ. ఇప్పు డర్థమయిందా?"




# గర్భస్రావం

పెద్దజ్వరము, ప్రసవము, తరువాత కేశములు ఎటుల నూడిపోవునో, అటులనే గర్భస్రావము వెనుకగూడ రాలిపోవును. కొద్ది జబ్బుచేసిన తరుపరికూడ జుట్టు రాలిపోవును. జబ్బుతో దిగులు ప్రారంభించిన ఎక్కువగా రాలిపోవును. కొన్ని విపరీత పరిస్థితులలో అవిితముగా రాలిపోవును. ఏ విధమైన కారణముతో రాలిపోవుచున్నను, కేశవర్ధనితో అట్లు రాలుట మాన్పుకొనుడు. జుట్టు రాలుట హానికరమైనది. కాని అది తప్పని విధికాదు. ఎంతవల్లననగా దానిని నివారించుటకు కేశవర్ధిని కలదు. జబ్బు సమయములలో కేశవర్ధినితో జుట్టును రాలకుండ రక్షించుకొనుడు.

## కేశవర్ధని

యిప్పుడే కేశవర్ధిని తీసుకొని మీ
శిరోజములను జాగ్రత్తపర్చుకొని,
సౌందర్యమును పొందుడు.

వర్తకులందరివద్దను దొరకును లేక

సౌత్ యిండియా
కెమికల్స్,

ఆర్. ఎస్. పురం, కోయంబత్తూరు.